క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

సత్తెనపల్లి: మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం తెలిపారు. ఈ సమావేశంలో అజెండాలోని అన్ని అంశాలపై చర్చించి ఆమోదించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫీషియోగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలని కోరారు.

ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

అచ్చంపేట: ఈ నెల 27న చెరుకుంపాలెం గ్రామానికి చెందిన 30 మంది కూలీలతో ప్రయాణిస్తున్న ఆటో సంగ్రతండా వద్ద పల్టీ కొట్టిన ఘటనలో 5గురికి తీవ్రగాయాలు కాగా, మరో 10మందికి స్వల్ప గాయాలైన విషయం పాఠకులకు విదితమే. దీనికి స్పందించిన స్నేహ హస్తాలు ప్రతినిధులు సోమవారం తీవ్ర గాయలైన ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేలు చొప్పున 5 కుటుంబాలకు రూ.25వేలు అందజేశారు. గాయాలపాలైన మరో 10 మంది కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.2,500లు విలువచేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మన్నెం భద్రయ్య, మన్నెం వెంకట్రావు, చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి సంఘం చైర్మన్ తుమ్మా శౌర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య మరణం పార్టీకి తీరని లోటు

అమరావతి: వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ యెడవల్లి వెంకయ్య మరణం పార్టీకి తీరని లోటని పలువురు నాయకులు ఆయన సేవలను కొనియాడారు. సోమవారం ఆయన మృతదేహాన్ని జీడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కోట హరిబాబు, నియోజకవర్గ నాయకుడు నంబూరు కళ్యాణ్‌చక్రవర్తి, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీ నరసింహారావు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

ఈవీఎంలపై ఓటరుకు అవగాహన

రాజుపాలెం: ఎన్నికల అధికారి స్లిప్ తీసుకుని ఈవీఎం మిషన్‌ను ఆన్ చేసిన తరువాతనే ఓటు వేయాలని తహసీల్దారు నళిని తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈవీఎంలపై ఓటర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొంతమంది ఓటర్లు బటన్ నొక్కి ఓటు ఏవిధంగా వెయ్యాలో సరిచూసుకున్నారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ మనకు కావాల్సిన గుర్తు ప్రక్కన ఉన్న బటన్‌ను నొక్కినప్పుడు ఆకుపచ్చ రంగు వెలుగుతుందని గమనించాలన్నారు. అప్పుడే ఓటు నమోదైనట్లు భావించాలి. మనం అనుకున్న గుర్తుకు ఓటు పడిందా లేదా తెలుసుకోవడానికి ఈవీఎం ప్రక్కనే డిస్‌ప్లే బోర్డును చూసుకోవచ్చన్నారు.ముందస్తు అవగాహన కార్యక్రమాల ద్వారా ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

నకరికల్లు: విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని ఆ శాఖ ఏఈ డి.నాగవెంకట సురేష్ వినియోగదారులకు సూచించారు. నకరికల్లులోని సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ బకాయిలు ఉన్న ఇళ్లకు సోమవారం వెళ్లి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో బిల్లులు చెల్లించినప్పుడే నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు సాధ్యపడుతుందని సూచించారు. బకాయిలు పేరుకుపోవడం వలన వినియోగదారులపై అదనపు భారం పడుతుందన్నారు. ఫోన్‌పే, పేటీఎం, ఏపీడీసీఎల్ తదితర యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు.

నేటి నుంచి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

క్రోసూరు: జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఈవోపీఆర్డీ పి.శివరామయ్య తెలిపారు. ఈ ప్రక్రియలో పాల్గొనే పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సోమవారం పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేపై విమర్శలు ఆపకపోతే గుణపాఠం తప్పదు

టీడీపీ నాయకుడు కంచేటి సాయిపై భగ్గుమన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పెదకూరపాడులో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు

పెదకూరపాడు: వైఎస్సార్‌సీపీ నుంచి ఇటీవల బహిష్కరణకు గురైన నేతలు వెన్నుపోటు పొడవడమే వారి నైజంగా వ్యవహరిస్తున్నారని, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై వ్యక్తిగత విమర్శలకు పాల్పడితే వారిని నియోజకవర్గంలో తిరగనీయమని వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. పెదకూరపాడులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదాసాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్‌షరీఫ్, జిల్లాపార్టీ కార్యదర్శి కంకణాలశివాజీ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు నల్లపాటి యోహాను, మండల ఎస్సీసెల్ నాయకుడు కంచర్ల అచ్యుతరావు, క్రోసూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ భయంకర్ సుభాని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ బహిష్కరించిన నేత కంచేటి సాయి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వారి కుటుంబ సభ్యులపై చేస్తున్న విమర్శలను వారు ఖండించారు. వైఎస్సార్‌సీపీలో అధికారంలో ఉన్న మూడున్నర సంవత్సరాలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేరు చెప్పి ఇసుక కాంట్రాక్టర్ల దగ్గర వాటాలు తీసుకున్న సాయికి ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కాదన్నారు. కంతేటి సాయి గతంలో నమ్మినవారిని నట్టేట ముంచి వెన్నుపోటు పొడిచారన్నారు. టీడీపీలో చేరి అవాస్తవాలు మాట్లాడుతూ ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులపై అబాంఢాలు మోపడం సరి కాదన్నారు. ఎమ్మెల్యేను అడ్డుపెట్టుకుని కోట్లు సంపాదించి టీడీపీలో చేరి విమర్శలు చేయడం ఏమిటని విమర్శించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చేసిన అభివృద్ధిపై చర్చించాలి గానీ, వ్యక్తిగత విమర్శలు చేయడం సరి కాదన్నారు. మరోమారు ఎమ్మెల్యేను విమర్శిస్తే నియోజకవర్గంలో ఎక్కడ కనబడినా సమాధానం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు రహమత్ బాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకరరావుపై విమర్శలు మానండి

అమరావతి: ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై గానీ వైఎస్సార్‌సీపీ నాయకుల మీద గానీ వ్యక్తిగత దూషణలకు దిగితే టీడీపీ నాయకుడు కంచేటి శాయిబాబు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీ నరసింహారావు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విమర్శలు అనేవి ఆలోచింపజేసేవిగా ఉండాలని అంతేగాని రెచ్చగొట్టే విధంగా ఉండకూడదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి మరల జరిగితే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి పార్టీలు మారే వలస పక్షి కంచేటి శాయి ఎమ్మెల్యే నంబూరుశంకరరావుపై వ్యక్తిగత విమర్శలు చేసి లబ్ధి పొందాలనుకుంటే అది కుదిరే పని కాదన్నారు. జెడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ మాట్లాడుతూ ఇసుక దొంగే ఇసుక దోపిడీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కోట్ల రూపాయలతో అమరావతి- బెల్లంకొండ రోడ్డు వేస్తుంటే అందులో అవినీతి జరిగిందని నీచమైన ఆరోపణలు చేయటం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటుగా కేంద్ర ప్రభుత్వ సంస్థ నాబార్డు సహకారంతో వేస్తున్న రోడ్డు నిర్మాణంలో కంచేటి సాయికి ధైర్యం ఉంటే అవినీతి జరిగిందని నిరూపించాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో అమరావతి గ్రామ సర్పంచ్ పి రాజేశ్వరి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆలపాటి వీరయ్య, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు బాబూరావు, వీరరాఘవయ్య, మాదినేని హరిబాబు, టి రోశయ్య, నడకుదురు నాగరాజు, మన్సూర్, శ్యామ్ తదితర నాయకులు పాల్గొన్నారు.



అమరావతిలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు



బెల్లంకొండలో మాట్లాడుతున్న నాయకులు

క్రోసూరు: వైఎస్సార్‌సీపీ నుంచి బహిష్కరణకు గురై తెలుగుదేశం పార్టీలో చేరి ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై వ్యక్తిగత దూషణలు చేస్తున్న కంచేటి సాయిబాబు తీరు మార్చుకోకుంటే తగిన గుణపాఠం చెబుతామని మండల వైఎస్సార్‌సీపీ హెచ్చరించింది. క్రోసూరు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు ఎమ్మెల్యేపై కంచేటి సాయిబాబు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్‌సీపీ మాజీ యార్డు డైరెక్టర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావును కంచేటి సాయిబాబు గెలిపించానని చెప్పటం సిగ్గుచేటని అన్నారు. అందరినీ గెలిపించే సత్తా నీకు ఉంటే నీవే పోటీ చేసి గెలవాలని అంతే గానీ వ్యక్తిగత విమర్శలకు పాల్పడితే సహించేది లేదన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు షేక్ జమీలా గఫూర్ మాట్లాడుతూ నీతి మాలిన పనులు వైఎస్సార్‌సీపీలో ఎవరూ చేయటం లేదన్నారు. యార్డు వైస్ చైర్మన్ గార్లపాటి దాసు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో అనేక మంది టీడీపీ నాయకులు నంబూరు శంకరరావు చేసే పనులను హర్షిస్తున్నారని అన్నారు. ఎంపీపీ పి.కోటయ్య మాట్లాడుతూ డబుల్ రోడ్డు కావాల్సిందేనని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సీఎం జగనన్న దగ్గర పట్టుబట్టి రూ.149 కోట్ల నాబార్డు నిధులతో రోడ్డు అనుమతులు సాధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, గల్లా గురుపాదం, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల కోటిరెడ్డి, షేక్ గఫూర్, గొర్రెపాటిరాజు, ఉప్పురి చిన్నాబాబు, షేక్ ముస్తాఫా, కాల్వపల్లి శ్రీనివాసరెడ్డి, మున్నంగి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకరరావును విమర్శించే స్థాయి కంచేటికి లేదు

బెల్లంకొండ: నిత్యం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ, ఎటువంటి అవినీతికి పాల్పడని ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై ఇటీవల టీడీపీలో చేరిన కంచేటి సాయి చేసిన వ్యాఖ్యలపై మండల వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. సోమవారం ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ చెన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మండల నాయకులతో కలసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్ల పాటు ఎమ్మెల్యే పేరు చెప్పుకుని అందిన కాడికి దోచుకున్న కంచేటి సాయి టీడీపీలో చేరాక కసాయిలా మారాడని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే శంకరరావు అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళ్తుంటే చూడలేక వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. నాలుగేళ్లుగా ఎమ్మెల్యేకు సొంత తమ్ముడిలా సాయి ఉన్నారని, ఎమ్మెల్యే పేరు చెప్పుకుని ఇసుక తవ్వకాలలో అక్రమాలకు పాల్పతున్న సాయిని ఎమ్మెల్యే కట్టడి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్నంతకాలం టీడీపీ నాయకులపై కేసులు పెట్టించిన వ్యక్తి సాయి అని అన్నారు. ఆ విషయాన్ని సాయి చుట్టూ ఉన్న టీడీపీ నాయకులు గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. మరోసారి ఎమ్మెల్యేపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్ పాషా, భద్రయ్య, మర్రి ప్రసాదరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి, సర్పంచ్‌లు రమణారెడ్డి, సైదయ్య, సాంబశివారెడ్డి, నరసింహా నాయక్, బాబూజీ, ప్రకాష్, బ్రహ్మం, ఎంపీటీసీలు రేగులగడ్డ శ్రీను, మర్రి శ్రీనివాసరెడ్డి, మండల జేసీయస్ కన్వీనర్ మిల్లు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా విజేత మాచాయపాలెం



బెల్లంకొండ: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా సోమవారం క్రోసూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన క్రికెట్ పోటీల్లో మండల పరిధిలోని మాచాయపాలెం జట్టు విజేతగా నిలిచింది. గతవారం మండల స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయికి చేరుకుంది. పాటిబండ్ల, అచ్చంపేట గ్రామాలకు చెందిన టీమ్‌లతో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. విజయం సాధించిన మాచాయపాలెం క్రీడాకారులను ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థి జీవితంలో ఏకాగ్రత ప్రధానం

సత్తెనపల్లి: విద్యార్థులు ఏకాగ్రతను కలిగి మనసును తమ ఆధీనంలో ఉంచుకున్నట్లయితే సాధించలేనిది ఏదీ లేదని ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు అన్నారు. నెహ్రూ యువ కేంద్రం గుంటూరు వారి సౌజన్యంతో హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థినీ విద్యార్థులకు నేషనల్ యూత్ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా యూత్ ఫర్ పీస్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి జీవితాన్ని జాగ్రత్తగా గడిపితేనే భవిష్యత్తుకు భద్రత ఉంటుందని, లేకపోతే ఆ వ్యక్తి జీవితమంతా సంఘర్షణ, సంక్షోభంతో నిండి ఉంటుందన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల కలిగి ఉన్నత ఆశయం కోసం శ్రమిస్తే భవిష్యత్తు మంచిగా ఉంటుందని అన్నారు. కార్య క్రమంలో ఫౌండేషన్ సభ్యులు సురేష్, శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

అచ్చంపేట: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడు, ఆర్యవైశ్యులు దైవంగా ఆరాధించే అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య జిల్లా కార్యదర్శులు దేవరశెట్టి శ్రీనివాసరావు, అన్నవరపు శ్రీనివాసరావు, గుండా రమేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం వారు అచ్చంపేటలో విలేకరులతో మాట్లాడారు. జాతీయోద్యమ నాయకుల విగ్రహాలను అపవిత్రం చేయడం దారుణమన్నారు. బాధ్యులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు అనుమోల వెంకటేశ్వరరావు, సంఘ ప్రముఖులు సూరే వెంకట సుబ్బారావు, దేసు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవం

తుమృకోట(రెంటచింతల): మండలంలోని తుమృకోట గ్రామంలో శుక్రవారం రాత్రి దర్గాలో ఉరుసు వేడుకలను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈ ఉరుసు మహోత్సవంలో పాల్గొని బాబావారికి నూతన చాదర్‌ను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి గంధ మహోత్సవాన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన బాబావారి గుర్రం గంధం, గలఫ్‌లతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన ఉరుసు మహోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషకరమన్నారు. ముస్లిం సోదరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.బాలునాయక్, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ అధ్యక్షులు పూజల రామయ్య, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, మండల యూత్ అధ్యక్షులు కొమ్మారెడ్డి సతీష్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పోట్ల ముత్తయ్య, ఎంపీటీసీ షేక్ జానీబాషా, నాయకులు షేక్ గొరేబుడే మహ్మద్ షరీఫ్, షేక్ సైసావలి, షేక్ గొరేబుడే సుభాని, తాళ్లపల్లి మహ్మద్ జాన్, కారంపూడి జానీ, పోట్ల శ్రీనివాసరావు, పేర్ల ముత్తయ్య, తుమ్మా ఇన్నారెడ్డి, సత్రశాల దేవస్థానం చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.



బాబావారికి చాదర్‌ను సమర్పిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం ఈ నెల 31న పట్టణంలోని భవిష్య పాఠశాల ఆవరణలో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం తెలిపారు.7వ సచివాలయం పరిధిలోని 7, 8 వార్డుల ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారు, కంటి పరీక్షలు చేయించుకోదలచిన వారు శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తారని వివరించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



మాచర్ల: ఉత్తమ అధికారి అవార్డు పొంది పట్టణాన్ని వివిధ రకాలుగా అభివృద్ధి చేసిన మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబును సోమవారం కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పట్టణంలో అనేక సంవత్సరాలుగా స్వచ్ఛ భారత్, స్వచ్ఛ పురపాలక సంఘం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ రెండు సార్లు ఉత్తమ అవార్డు పొందటం అభినందనీయమని ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రమణబాబును శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ సేవలు కొనియాడుతూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

లేగదూడల అందాల పోటీలకు స్పందన

బెల్లంకొండ: పశుపోషణపై రైతులు అవగహన కలిగి ఉండాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరడ్డి అన్నారు. మండలంలోని మాచాయపాలెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం లేగ దూడల అందాల పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పాడి పశువుల పెంపకం ఆదాయ, ఉపాధి మార్గాలుగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పశుపోషణలో పశుసంవర్ధక శాఖ అధికారుల సూచనలు తీసుకోవాలని సూచించారు. ఏడీ నరసింహులు మాట్లాడుతూ మొదటి మూడు నెలల వయస్సు గల దూడలకు పాలు ప్రధానమైన ఆహారమని, వాటికి చెందాల్సిన పాలను అందించాలన్నారు. గెలుపొందిన దూడల యజమానులకు ఎంపీపీ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామనబోయిన ఆదిగోపాలరావు, లక్ష్మీనారాయణ, ఏడీ వీరయ్య, వైస్ సర్పంచ్ శ్రీను, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వర రెడ్డి, అధికారులు

పునీతురాలు మరియతల్లి

ఫాదర్ కిశోర్

రెంటచింతల: ప్రపంచ మానవాళిని పాపముల నుంచి రక్షించుటకు యెహోవా దేవుడు తన కుమారుడైన లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మించుటకు ఎన్నుకోబడిన పునీతురాలు మరియతల్లి అని క్రోసూరు విచారణ గురువులు రెవ.ఫాదర్ గాదె కిశోర్ అన్నారు. స్థానిక కానుకమాత చర్చి 174వ మహోత్సవంలో భాగంగా సోమవారం విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్ధుమర్రెడ్డి ఆధ్వర్యంలో ఆనంద్‌పేట కాలనీలో నిర్వహించిన నవదిన ప్రార్థనలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కన్య మరియమ్మ జీవితం కథోలిక సంఘానికి ఆదర్శనీయమన్నారు. ఎంతో పవిత్రమైన మరియతల్లిని ప్రార్థించిన వారి తలంపులు నెరవేరి ఆ తల్లి ఆశీస్సులతో వారు సుఖసంతోషాలతో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ఈ నవదిన ప్రార్థనలలో పాల్గొని తల్లి మరియ ఆశీస్సులు పొందాలని కోరారు. దివ్యపూజాబలిలో ఫాదర్లు అగస్టీన్, డీకన్ బ్రదర్ కోడిగంటి నిఖిల్ తేజ, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా గిరికుమార్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా బీఎస్ గిరికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తిరుపతి జిల్లా గుడూరు మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. నూతనంగా పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా బీఎస్ గిరికుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో మాచర్ల మున్సిపాలిటీలో చేశారు. ప్రస్తుతం మార్కాపురం మున్సిపాలిటీ నుంచి పిడుగురాళ్ల మున్సిపాలిటీకి ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు.

తక్కెళ్లపాడు రోడ్డుకు రూ.25 లక్షలు మంజూరు



దాచేపల్లి : మండలంలోని తక్కెళ్లపాడు గ్రామం ప్రధాన రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.25లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కాసు దృష్టికి గ్రామస్తులు మెయిన్ రోడ్డు సమస్యను తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన ఆయన రోడ్డు నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. రూ.25 లక్షల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలోనే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పాస్టర్లు ప్రజలను మంచి మార్గంలో నడిపించాలి

గురజాల : పాస్టర్లు ప్రజలను మంచి మార్గంలో నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జి.ఐ.సి కాలనీలో కృపామయుడు ప్రార్థన మందిరం 7వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాలి, దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. పాస్టర్లు అందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి ఆంధ్రయ్య, పాస్టర్లు అబ్రహం, ఏసుదాసు, సాల్మన్‌రాజు, సాగర్, జయప్రకాష్, రాజేష్, ఆదూరి మాణిక్యరావు, సంఘ విశ్వాసులు, తదితరులున్నారు.